క్లుప్తంగా

ప్రీ స్కూల్‌లో ఒత్తిడి లేని విద్య



పెదకూరపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్యనందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ షేక్ మున్నీ అన్నారు. పెదకూరపాడులోని అంగన్ వాడీ–6లో గురువారం ప్రీ స్కూల్ పిల్లలకు పోషణ మహోత్సవం నిర్వహించారు. కాన్వెంట్‌లో మూడు నాలుగేళ్ల చిన్నారులను చేర్పించడం వల్ల ఒత్తిడికి లోనవుతారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒత్తిడి లేని విద్యతోపాటు వారికి అర్థమయ్యే రీతిలో ఆటపాటలతో కూడిన బోధన చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బీవీ సామ్రాజ్యం, కుమారి, సామ్రాజ్యం పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని అలవర్చుకోవాలి



రాజుపాలెం: ఆరోగ్యవంతమైన పైరును, నాణ్యమైన దిగుబడులు పొందాలంటే రైతులు రసాయనిక క్రిమి సంహారకాల వాడకాలను తగ్గించి, సేంద్రియం వైపు మొగ్గు చూపాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.వెంకట నర్సయ్య అన్నారు. కోట నెమలిపురి సమీపంలోని వరి పంటలో పొలం బడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ద్రవ జీవామృతం తయారీ విధానం చేసి, చూపించారు. మండల పరిధిలోని రైతులందరూ తప్పకుండా ఈ నెల 23వ తేదీ లోపు పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ జయలక్ష్మి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడా జట్ల ఎంపిక



పెదకూరపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, జి.ఆర్.సి.కె పాఠశాలల్లో గురువారం మండల స్థాయి క్రీడకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు జరిగాయి. క్రీడాకారులు పలు ఆటల్లో హోరాహోరీగా తలపడ్డారు. హెచ్ఎం కాకాని వెంకటరమణ, జీఆర్‌సీకే డైరెక్టర్ రాము, పెదకూరపాడు నియోజకవర్గ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ నాగరాజు పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు సాంబశివరావు, అరుణశ్రీ, పూర్ణ, ఎం.అజయ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తిలో రసం పీల్చు పురుగు ఉధృతి



అచ్చంపేట: ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పత్తి పంటలో రసం పీల్చు పురుగుల ఉధృతి ఉన్నట్లు ఏడీఏ వి.హనుమంతరావు తెలిపారు. చిగురుపాడులో గురువారం ఆయన ఏవో పి.వెంకటేశ్వర్లుతో కలసి పత్తి పంటను పరిశీలించారు. పంటలో పేనుబంక, తామర పురుగు, తెల్లదోమ, పచ్చదోమ, రసం పీల్చే పురుగుల నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్టు

నాదెండ్ల: గణపవరంలో గత నెల 22న ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన యువకుడిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్ఐ జి.పుల్లారావు వివరాల మేరకు గణపవరం సినిమాహాలు రోడ్డులో నివాసం ఉండే గుంటుపల్లి శ్రీనివాసరావు తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు ఉంచి కుటుంబ సభ్యులతో కలిసి చిలకలూరిపేటలోని ఓ వేడుకకు హాజరయ్యారు. రాత్రి 11 గంటలకు తిరిగి రాగా ఇంటి ముందు వాహనం కనిపించ లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గణపవరం కుప్పగంజి వాగు సమీపంలో నివాసం ఉండే అచ్చి అంకమ్మ బైక్‌ను దొంగిలించినట్లుగా గుర్తించి నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పొలంలో నడచి వెళ్తున్న వ్యక్తిపై దాడి

ఈపూరు: తమ పొలం దారిలో నుంచి వెళ్తున్నాడని ఒక వ్యక్తిపై కొడవలితో దాడి చేసిన సంఘటన చినకొండాయపాలెంలో బుధవారం జరిగింది. ఎస్ఐ ఉమామహేశ్వరరావు వివరాల మేరకు.. గోరంట్ల సురేష్ గడిపూడి చిన్నకోటయ్య పొలం దారిలో వెళ్తున్నాడు. దారి లేకుండా ఎలా వెళ్తావని కోటయ్య సురేష్ చేతిపై నరికాడు. సురేష్ చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలలో చేరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రామీణ వైద్యానికి పక్షవాతం


- జీవో నంబరు 85 రద్దుకు గ్రామీణ వైద్యుల సమ్మె బాట
- పీజీ కోర్సుల్లో 30శాతం కోటాకు కూటమి ప్రభుత్వం కత్తెర
- 15 శాతానికి కుదింపు, నాలుగు స్పెషలైజేషన్లకే వర్తింపు
- గ్రామీణ ప్రాంతాల్లో సేవలకు విముఖత వ్యక్తమయ్యే ప్రమాదం
- దశల వారీగా నిరసన తెలియజేస్తున్నా పట్టించుకోని వైనం
- పీహెచ్‌సీల్లో పూర్తిగా ఓపీ సేవలు బంద్
- ఆసుపత్రులకు వచ్చి వెనుతిరుగుతున్న రోగులు

కూటమి ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ వైద్యానికి పక్షవాతం చేసింది. పీజీ కోర్సుల్లో తమ రిజర్వేషన్‌కు కోత పెట్టడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆందోళన బాటపట్టారు. దీంతో అన్ని పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు నిలిచిపోయాయి. ఒకవైపు మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమైన ప్రభుత్వం, వైద్యులు ప్రత్యేక కోర్సులు చేసేందుకు కూడా అడ్డంకి సృష్టించింది. ఇన్ సర్వీస్ కోటా తగ్గింపుతో గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించేందుకు ఎంబీబీఎస్ డాక్టర్లు విముఖత వ్యక్తం చేసే ప్రమాదముంది.



రోగులు వెనుదిరిగి పోవడంతో ఖాళీగా ఉన్న పణిదం పీహెచ్‌సీ

సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి, పణిదం, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు లేక సిబ్బంది మాత్రమే అరకొర సేవలందిస్తున్నారు. సీజనల్ జ్వరాలు, ఇతర రోగులు వైద్యం కోసం వచ్చి వెనుదిరుగుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఇల్లు గడవని పేదలకు వైద్యం ఖర్చు ఆర్థిక భారమవుతోంది.



దశల వారీ నిరసన..

ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబరు 85 రద్దు చేయాలంటూ వైద్యులు ఈ నెల 10వ తేదీ నుంచి విధులకు ఆటంకం లేకుండా నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. 11, 12వ తేదీల్లో ప్రభుత్వం చర్చలకు వస్తుందని ఎదురు చూశారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. తర్వాత రోజు అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా ఉన్నతాధికారులకు తెలియజేశారు. 14న అత్యవసర వైద్య సేవలకు మాత్రమే పరిమితమై.. ఓపీలను బంద్ చేశారు. 16 వరకు నిరసన కొనసాగించారు. అయినా జీవో రద్దు చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా చలో విజయవాడకు బయలుదేరి సమ్మె ఉధృతం చేశారు.

ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన...

ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం పేర్కొంటోంది. కోవిడ్–19 లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించినప్పటికీ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేసే వైద్యుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తమవుతోంది. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న తమపై ప్రభుత్వానికి చులకన తగదని, తక్షణమే జీవోను రద్దు చేసి, యథావిధిగా 30 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వైద్యుల సంఘం డిమాండ్ చేస్తోంది.

జీఓ నంబరు 85లో ఏముందంటే..!

కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే జీవో నంబరు 85ను తీసుకొచ్చింది. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఎంబీబీఎస్ వైద్యులకు పీజీ సీట్లలో 30 శాతం కోటా ఉండేది. దాన్ని 15 శాతానికి తగ్గిస్తూ జీవో తీసుకొచ్చింది. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసేందుకు ఎంబీబీఎస్ వైద్యులు మొగ్గు చూపే అవకాశం తగ్గిపోతుంది. అంతే కాకుండా పీజీ వైద్య సీట్లలో ప్రభుత్వం గుర్తించిన నాలుగు స్పెషలైజేషన్‌లో నేలో 15 శాతం కోటా ఇస్తారు.

పెట్టుబడి సాయం జమ చేయాలి

పెదకూరపాడు: అన్నదాత సుఖీభవ పథకం కింద కూటమి ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు దానియేల్‌ను కలిసి గురువారం వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలోని అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ, పెదకూరపాడు మండలాల్లో పత్తి, అపరాలు, ఇతర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు చెప్పారు. పెట్టుబడి సాయం వెంటనే అందిస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహారావు, పి.వెంకట్రావు, సురేష్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తహసీల్దారు దానియేలుకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

సచివాలయ భవనం ప్రారంభం

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దబడుతుందని సత్తెనపల్లి శాసన సభ్యుడు కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. నందిగామలో గత ప్రభుత్వం రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అలాగే రూ.15 లక్షలతో సీసీ రోడ్, డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే గ్రామాలకు వచ్చిన ప్రతి రూపాయిని సక్రమంగా వినియోగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలన్నీ ఒక్కొక్కటి కూడా చేసుకుంటూ వెళుతున్నామన్నారు. దానిలో భాగంగా దీపావళికి ఎన్నికల సమయంలో చెప్పినట్లుగా ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

డీఎస్పీ హనుమంతరావుకు సత్కారం

సత్తెనపల్లి: సత్తెనపల్లి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మేదరమెట్ల హనుమంతరావును గురువారం పట్టణ ఆర్యవైశ్య సంఘం, చైతన్య వివేకా సేవా సమితి అభ్యుదయ విజ్ఞాన సమితి బాధ్యులు మర్యాద పూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. మాడ మల్లికార్జునరావు షేక్ జాకీర్, కూనాగు వెంకటేశ్వర్లు, మద్ది భాస్కర్, నోముల వెంకట చలపతిరావు, మండడపు శ్రీనివాసరావు, మట్టి వెంకటేశ్వర్లు, దివ్వెల శ్రీనివాసరావు, దేవరపల్లి కాశీ, బాలనాగు శివకోటేశ్వరరావు ఉన్నారు.



డీఎస్పీని సన్మానిస్తున్న మల్లికార్జునరావు

మధిరలో పుట్లగూడెం యువకుడి ఆత్మహత్య

అచ్చంపేట:మండలంలోని పుట్లగూడెం గ్రామానికి చెందిన చెట్టి రఘువర్మ(22) తెలంగాణలోని ఖమ్మం జిల్లా మధిరలో గురువారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు మృతుని తండ్రి నాగరాజు గ్రామంలో చిన్న కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. పెద్ద కొడుకు రఘువర్మ మధిరలోని అమ్మమ్మ ఇంటిలో ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. అయితే అతని ఆత్మహత్యపై గ్రామస్తులు విభిన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



మృతుడు రఘువర్మ(ఫైల్)

దివ్యాంగులకు జీవనోపాధి కల్పనే ధ్యేయం

బెల్లంకొండ: గ్రామ, మండల స్థాయిలో దివ్యాంగులను సమీకరించి, జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడమే ధ్యేయమని ఎనేబుల్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ స్టేట్ మేనేజర్ సుమిత్ తెలిపారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని బేడ బుడగ జంగాల కాలనీలో గ్రేస్ మహిళా మండలి, హ్యాండ్సప్ కంపాషన్ ఆర్గనైజేషన్ సహకారంతో దివ్యాంగుల అభ్యున్నతి కోసం సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగులను గుర్తించి వారికి ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బ్యాంకు రుణ సదుపాయాన్ని కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గ్రేస్ మహిళా మండలి అధ్యక్షురాలు కీర్తన, హ్యాండ్సప్ కంపర్షన్ సంస్థ తరపు బి.మనోహర్, గడ్డిపర్తి చినబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

నేటి నుంచి గ్రామ సభలు

నకరికల్లు: మండలంలో శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామానికి నోడల్ అధికారులను కేటాయించి, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు కేటాయించిన సిబ్బంది 100 రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు వివరించాలని తెలిపారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



అచ్చంపేట: స్థానిక టీఎస్సార్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. హెచ్ఎం చిగురుపాటి కల్యాణి క్రీడలను ప్రారంభించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఆలపాటి సుజాత మాట్లాడుతూ మండలంలోని 7 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 240 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. పోటీలు రెండు రోజులు జరుగుతాయన్నారు. మొదటి రోజు అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలు నిర్వహించి, జట్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. శుక్రవారం అథ్లెటిక్ నిర్వహిస్తామన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



88త్యాళ్లూరు(క్రోసూరు): మండలంలోని 88 త్యాళ్లూరు గ్రామంలో గురువారం రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. మండల పశు వైద్యుడు డాక్టర్ మల్లయ్య మాట్లాడుతూ.. 16 పశువులకు సాధారణ చికిత్సలు, 22 పశువులకు నట్టల నివారణ మందు పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించినట్లు చెప్పారు. పెదకూరపాడు ఏడీఏ డాక్టర్ కె.శివసారథి బాబు, మక్కపాడు వైద్యుడు డాక్టర్ కె.నాగేశ్వరరావు, మాదల వైద్యుడు డాక్టర్ పుల్లారెడ్డి, సర్పంచ్ లింగయ్య, బలరామకృష్ణంరాజు, నలజాల సదాశివరావు పాల్గొన్నారు.

రైతులకు సాయమందించాలి

ఫిరంగిపురం: రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించాలని కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల మండల నాయకులు పొనుగుపాడు సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాత పెట్టుబడి సాయం కింద నగదు అందజేసి, రైతులను ఆదుకోవాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎ.కృష్ణ, డి.పోతురాజు, పి.చంద్రమౌళి, షేక్.హుస్సేన్, వై.రత్నకుమారి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు



విజయవాడ రోడ్డుపై ఎస్సీ హాస్టల్ వద్ద పారుతున్న మురుగు నీరు

అమరావతిలో దుర్గంధం

అమరావతి: ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పర్యాటక కేంద్రం అమరావతిలో రోడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇటీవల వచ్చిన వరదలకు స్థానిక విజయవాడ రోడ్డులోని ఎస్సీ వసతి గృహం వద్ద అర్అండ్‌బీ రోడ్డు అడుగున తూములు పూడిపోయాయి. దీంతో ఎగువ నుంచి వచ్చే మురుగు రోడ్డుపై నుంచి పారుతోంది. చుట్టు పక్కల వారిని అక్కడి నుంచి వచ్చే దుర్గంధం, తద్వారా విపరీతమైన దోమల ఉధ్రుతి రోగాల బారిన పడేస్తోంది. అమరావతి–విజయవాడ రోడ్డుపై మోకాలి లోతు గుంతల్లో పడి తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎగువన వైకుంఠపురం సమగ్ర తాగునీటి పథకం నుంచి వచ్చే మురుగు నీరంతా దిగువకు వస్తున్నందున తాము ఇబ్బందులు పడుతున్నామని గోపాల్ నగర్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే శిథిలావస్థలో ఉన్న ఎస్సీ కాలనీ భవనాలు ప్రహరీలు లేక మురుగు నీరు నిల్వతో మరింత బలహీన పడుతున్నాయని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, మురుగు నీటికి అడ్డుకట్ట వేసి, తూముల పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ సంతోషికుమారి



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు

మాదల(ముప్పాళ్ళ): మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని కిశోర బాలికలకు పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం రక్త హీనతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ సంతోషి కుమారి పాల్గొని రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషణ మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకుకూరల్లో అధిక పోషకాలు

అచ్చంపేట: ఆకు కూరల్లో అధిక పోషకాలు ఉంటాయని వాటితో పాటు కిశోర బాలికలకు చిరుధాన్యాలు, బెల్లం వంటి పదార్థాలను ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎస్.మాణిక్యమ్మ తెలిపారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం కిశోర బాలికలతో అచ్చంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 11 నుంచి 14 సంవత్సరాలలోపు బాలికలు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారం తయారీని వివరించారు. బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు.

జీఓ నంబరు 115ను రద్దు చేయాలి

సత్తెనపల్లి: ప్రభుత్వం జీవో నంబరు 115ను రద్దు చేసి, తమను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు కోరారు. గురువారం సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎన్ఎం, బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ వ్యవస్థను గుర్తించాలన్నారు. 15 ఏళ్ల నుంచి నర్సులుగా చేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకుండా కొత్తగా వచ్చిన ఏఎన్ఎంలకు నర్సు పోస్టులు ఇవ్వడం చాలా బాధాకరమన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చారు. జీఎన్ఎం, స్టాఫ్ నర్సులకు ప్రభుత్వ ఏరియా వైద్యశాల కాంట్రాక్టు సిబ్బంది మద్దతుగా నిలిచారు.



ఎమ్మెల్యే కన్నాకు వినతి పత్రం అందిస్తున్న నర్సులు

మాదలలో యువకుల ఘర్షణ

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలోని రెండు సామాజిక వర్గాలకు చెందిన యువకుల మధ్య వివాదం ముదిరి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. ఒక సామాజిక వర్గానికి చెందిన వినాయకుని నిమజ్జన ఊరేగింపు సమయంలో డ్యాన్స్ వేసే విషయంలో రెండు వర్గాల యువకుల మధ్య వివాదం రేగింది. యువకులు ఘర్షణ పడ్డారు. జాకీర్, హుస్సేన్ తలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధితులు ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


క్రోసూరు: స్థానిక పంచాయతీలో గురువారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయ వీధితో పాటు వీధుల్లో మురుగు కాల్వలను శుభ్రం చేశారు. ఎబెట్ పిచికారి చేశారు. ఎర్రబాలెం గ్రామంలో రక్షిత తాగునీటి సరఫరా చేసున్న పైపు లైను మరమ్మతులు చేపట్టారు. పంచాయతీ సెక్రటరీ ఆదినారాయణ పర్యవేక్షించారు.



నిందితులను కఠినంగా శిక్షించాలి

క్రోసూరు: కర్నూలు జిల్లా కల్లుగుంట గ్రామంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన గోవిందమ్మను వివస్త్రను చేసి, అవమానించిన వారిని కఠినంగా శిక్షించానలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటి దాసు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాసు మాట్లాడుతూ గోవిందమ్మ కుమారుడు గ్రామంలోని రజక సామాజిక వర్గానికి చెందిన అమ్మాయిని ప్రేమించి, పెళ్లి చేసుకున్నారని తెలిపారు. ఇది సహించలేని కొందరు గోవిందమ్మను వివస్త్రను చేసి ఊరంతా నగ్నంగా తిప్పి స్తంభానికి కట్టివేసి కొట్టి సభ్య సమాజం తలదించుకొనేలా చేశారని తెలిపారు. పోలీసు అధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



క్రోసూరు: పారుపల్లి గ్రామానికి చెందిన రమేష్ అనే యువకుడు కనిపించడం లేదని తండ్రి పారుపల్లి వెంకటేశ్వర్లు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.నాగేంద్రరావు తెలిపారు. కూలీ పనులు చేస్తున్న రమేష్ గత నెల 30 ఇంటి నుంచి కూరగాయలు తీసుకుని రావడానికని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96235, పోలీసు స్టేషన్‌కు నంబరు 08640–227133కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.